లింగంపల్లి - ఘట్‌కేసర్ మధ్య నేటి నుంచి ఎంఎంటీఎస్ సర్వీసు ప్రారంభం

ఖైల్‌కాలనీ/కుషాయిగూడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నేడు నగరంలో లింగంపల్లి - ఘట్‌కేసర్‌ల మధ్య ఎంఎంటీఎస్ రైలు సేవలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రతిరోజూ తొమ్మిది బోగీలతో గల ఎంఎంటీఎస్ రైలు రెండు ట్రిప్పులు తిరిగే విధంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా రైలు ట్రిప్పులను పెంచుతామని దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

ఎంఎంటీఎస్ సమయం వివరాలు..

ప్రారంభం సందర్భంగా మంగళవారం ఘట్‌కేసర్ నుంచి ఉదయం 10.45కి ఎంఎంటీఎస్ బయలుదేరి చర్లపల్లికి 10.59గంటలకు, నేరేడ్‌మెట్‌కు 11.21కి, అమ్ముగూడకి 11.29కి, భూదేవీనగర్‌కు 11.36కి, సుచిత్ర సెంటర్‌కు 11.45కి, ఫిరోజ్‌గూడ 11.54కు, భరత్‌నగర్ 12.03కు, బోరబండ 12.07కు, హైటెక్‌సిటీకి 12.12, హఫీజ్‌పేట్‌కి 12.18, చందానగర్‌కి మధ్యాహ్నం 12.23, లింగంపల్లికి 12.40కి చేరుతుంది.

'శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి'

కీసర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి ఈ నెల 6 నుంచి ఆరు రోజుల పాటు కీసరగుట్టపై జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం కీసరగుట్టలోని కల్యాణ మండపంలో ఆయా శాఖల అధికారులతో, ప్రజాప్రతినిధులతో, ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ దాదాపు 1800 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని, 56 సీసీ కెమెరాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత బస్సు సౌకర్యాంలో భాగంగా 300 బస్సులు జాతరకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముందు కలెక్టర్ గౌతమ్, ఆయా శాఖల అధికారులతో కలిసి కీసరగుట్ట క్షేత్రంపై కలియతిరిగారు.

అపోలో ఆస్పత్రిలో మహిళకు కార్-టీ సెల్ థెరపీ

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి కార్ - టీ సెల్ థెరపీని నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన 50 ఏళ్ల మహిళా రోగి కొంతకాలంగా మల్టీపుల్ మైలోమా (బ్లడ్ కేన్సర్ కండిషన్)తో బాధపడుతున్నది. ఆమె ఇటీవల అపోలో కేన్సర్ సెంటర్ వైద్యుల వద్దకు రాగా, ఆమెకు వైద్య పరీక్షలు చేసి కేవలం కార్-టీ థెరపీ ద్వారానే చికిత్స అందించడానికి అవకాశముందని నిర్ధారించుకుని వైద్య ప్రక్రియను ప్రారంభించారు. చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ టీ-సెల్ (కార్-టీ) థెరపీని విజయవంతంగా నిర్వహించి కేన్సర్ చికిత్సలో అపోలో ఆస్పత్రి మరో మైలురాయిని చేరుకుందని అపోలో కేన్సర్ సెంటర్ హెమటాలజిస్ట్, బీఎంటీ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజ లోకిరెడ్డి చెప్పారు. అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడంలో తమ ఆస్పత్రి ముందంజలో ఉంటున్నదన్నారు.

24వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య


ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 24వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో టెట్‌తోపాటు 24వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ సాధనకోసం మహాధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లను ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. ఇరవై సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఐదువేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ టీచర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి భర్తీ చేయాలన్నారు. బీసీ యువజన సంఘంరాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షత జరిగిన ధర్నాలో బీసీ నేతలు గువ్వల భరత్, నందగోపాల్, రామకృష్ణ, నరసింహాగౌడ్, పోతులారం కృష్ణ, ప్రీతమ్, రాందేవ్, ఉదయ్, సతీష్, నిఖిల్, రఘుపతి, కరుణశ్రీ జయంతితోపాటు పెద్ద ఎత్తున నిరుద్యోగులు పాల్గొన్నారు.

'ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు వేతనాలు పెంచాలి'

హైదరాబాద్ సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేతనాలను పెంచాలని కోరుతూ తెలంగాణ రెండో వేతన సవరణ కమిషన్ కమిషనర్ శివశంకర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు గత వేతన సవరణల్లో జరిగిన అన్యాయాలపై పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని వేతనసవరణ కమిషన్‌ను కోరారు. ల్యాబ్ టెక్నీషియన్లకు వృత్తిపరంగా ఉన్న రిస్క్ ఫ్యాక్టర్స్ వల్ల కలిగే జీవితకాల ఆరోగ్య ప్రమాదాలకై, విద్య, వైద్యం కోసం ప్రత్యేక అలవెన్సు మంజూరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, కార్యదర్శి రమేష్, బురాన్, వేణుగోపాల్, భాస్కర్, సునీత, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడంతస్తుల మేడపైనుంచి పడి వృద్ధురాలి మృతి


శారద బెన్ (ఫైల్)

రాజేంద్రనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉతికిన దుస్తులు ఆరేస్తూ మూడంతస్తుల మేడ పైనుంచి కిందపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీలో ఇలీష్ కుమార్ కుటుంబం నివాసం ఉంటున్నది. సోమవారం ఇంట్లోని వారంతా పనుల నిమిత్తం బయటకు వెళ్లగా ఇలీష్‌కుమార్ తల్లి శారద బెన్(70) మూడంతస్తుల భవనంపై దుస్తులు ఆరవేస్తుండగా కళ్లు తిరిగి పై నుంచి కింద పడింది. మృతిచెందింది. శబ్దం రావడంతో నాలుగో అంతస్తులోని భావన పటేల్ బయటకు వచ్చి చూసి ఇలీష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇలీష్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ భాను ప్రకాశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

నగరంలో టానిక్ లిక్కర్స్ సెంటర్లలో వాణిజ్య పన్నుల శాఖ సోదాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టానిక్ లిక్కర్స్ గ్రూప్‌నకు చెందిన షాపులు, వాటి అనుబంధ సంస్థలలో వాణిజ్య పన్నుల శాఖాధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 11గంటల వరకు కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీలతో పాటు నగరంలో సుమారు 10చోట్ల సోదాలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న బ్రాండ్స్‌కు సంబంధించి కొనుగోలు వివరాలు.. ఎప్పుడు ఆర్డర్ ఇచ్చారు.. ఎక్కడి నుంచి సరఫరా అయింది? వాటికి సంబంధించిన లేబుల్స్ వివరాలను సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు వివరించిన తర్వాత తదుపరి చర్యలుంటాయని అధికారులు పేర్కొన్నారు.

విదేశాలకు తల వెంట్రుకలు ఎగుమతిలో అక్రమాలు

● ఈడీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును అనుమతించిన కోర్టు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు తల వెంట్రుకలు(జుట్టు) ఎగుమతి చేసి కోట్ల రూపాయలు అక్రమాలకు పాల్పడ్డ కేసులో ఈడీ దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును కోర్టు అనుమతించింది. జుట్టు అక్రమ ఎగుమతులపై ఈడీ నైల ఫ్యామిలీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌కు చెందిన 17 మందిపై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఇందుకు సంబంధించిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును గత ఆగస్టు 21న నాంపల్లి పీఎంఎల్‌ఏ ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేసింది. ఈ ఫిర్యాదును కోర్టు ఇటీవలే అనుమతించినట్లు ఈడీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ వెంట్రుకలను మిజోరం వద్ద భూమార్గంలో మయన్మార్, చైనా, బంగ్లాదేశ్, వియత్నాంకు ఎగుమతి చేసినట్లు లభించిన ఆధారాల మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ పలు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో రూ. 1.21 కోట్లు లెక్కలోలేని నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాల్లోని రూ. 7.85 కోట్లు ఫ్రీజ్ చేసింది.

అయ్యప్పస్వామి బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

● ఆలయంలో పూజలు చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


అయ్యప్పస్వామి ఆలయంలో వంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

చంపాపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ డిఫెన్స్‌కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి తన మాతృమూర్తి, సోదరునితో కలిసి ఆలయంలో హంపి విరూపాక్ష పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతి స్వామి వారి ఆశీస్సులను పొందారు. ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్న అయ్యప్పస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవ ఆహ్వాన శుభపత్రిక బ్రోచర్‌ను ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, కోశాధికారి కొక్కొండ సూర్యప్రకాష్‌గుప్తా, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఆలయ డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, ఎన్ విజ్ఞేశ్వర్‌రెడ్డి, మిరియాల అంజయ్యగుప్తా, సుంకరి రమేష్‌గౌడ్, మల్లికార్జున్ గుప్తా, భిక్షపతిగౌడ్, జగిని రమేష్‌గుప్తా, జగిని శ్రీనివాస్‌గుప్తా, నాయకులు యోగేశ్వర్‌రెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గ్యారగోని ప్రవీణ్‌గౌడ్, శ్రీపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వంద రోజుల్లో నాలుగు హామీలను నెరవేర్చాం : మంత్రి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల లోపే ప్రజలకిచ్చిన నాలుగు ప్రధాన హామీలను నెరవేర్చినట్లు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని హరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, 5 వందల రూపాయలకు సిలిండర్, 2 వందల యూనిట్లలోపు వారికి జీరో బిల్లు ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు తమను ఆశీర్వదించినట్లు, వారి కళ్లల్లో ఆనందం నింపనున్నట్లు అన్నారు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ముందుకు సాగనున్నట్లు మంత్రి తెలిపారు. అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా సహకరించనున్నట్లు తెలిపారు.

బాలాపూర్ మహదేవ్‌జీ స్వామి ఆలయ పాలకవర్గం నియామకం

● కమిటీ చైర్మన్‌గా శశిధర్‌రెడ్డి


ఆలయ కమిటీ పాలకవర్గం ప్రతినిధులను సన్మానిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో గల పురాతన మహదేవ్‌జీ స్వామి ఆలయం(శివాలయం) నూతన పాలకవర్గాన్ని ఎండోమెంట్ అధికారులు సోమవారం ప్రకటించారు. ఐదుగురు సభ్యులతో కూడిన పాలకవర్గంలో టేకుల శశిధర్‌రెడ్డి, ఇక్కె మాధవీశ్రీనివాస్, కళ్లెం శ్రీధర్‌రెడ్డి, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, పగుడాల ఉమేశ్‌లను నియమించారు. ఆలయ అర్చకుడు జయదుర్గాప్రసాద్‌ను ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నియమించారు. వారిలో నుంచి టేకుల శశిధర్‌రెడ్డిని కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఏడాది పాటు పదవిలో కొనసాగనుంది. కాగా సోమవారం ఆలయం ఆవరణలో టెంపుల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా తూర్పు విభాగం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రణీత్‌కుమార్ పాల్గొని పాలకవర్గం ప్రతినిధులకు నియామక పత్రాలు అందజేసి, వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

● మేయర్ పారిజాతారెడ్డి

ఆలయం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి కమిటీ ప్రతినిధులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కమిటీ సభ్యులు భక్తుల అభీష్టానికి అనుగుణంగా నడుచుకుంటూ ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. చైర్మన్‌గా ఎన్నికైన శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో ఆలయాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, నేనావత్ బాలూనాయక్, ఎర్ర మహేశ్వరీజైహింద్‌కుమార్, వేణుగోపాల్‌స్వామి ఆలయ డైరెక్టర్లు మల్లారెడ్డి, ఆంజనేయచారి పాల్గొన్నారు.

ఘనంగా జీఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవం


జీఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవంలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ వెంకటేశ్వరరావు, రాజు

మన్సూరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడలోని జీఎస్ఐలో సంస్థ 174వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జీఎస్ఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్ సీహెచ్ వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో జీఎస్ఐ పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న డిమాండ్, సవాళ్ల నేపథ్యంలో ఖనిజ పరిశోధనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. వేడుకలకు జీఎస్ఐ రిటైర్డ్ డీజీ ఎం.రాజు హాజరయ్యారు. ఖనిజ అన్వేషణకు జీఎస్ఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యకలాపాలను వివరించారు. కాగా, బండ్లగూడలోని భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణ సంస్థ (జీఎస్ఐటీఐ) లోనూ సంస్థ 174వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్లు, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ మాట్లాడుతూ జీఎస్ఐ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు సాధించిన విజయాలు, భవిష్యత్తులో సాధించాల్సిన లక్ష్యాలను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డీడీజీలు ఎల్.పి.సింగ్, అన్షుమాన్ ఆచార్య, ఎస్ఎన్ పాత్ర, జీఎస్ఐ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదర్శ మహేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.


హైదరాబాద్ శివారులోని రామోజీ ఫిల్మ్‌సిటీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.
- అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి


మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, నాయకులు నీరంకి రవి, సుందర్‌నారాయణ, అశోక్‌గౌడ్ తదితరులు
- కొత్తపేట, ఆంధ్రజ్యోతి

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

వనస్థలిపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్‌ను బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీల ఐక్యవేదిక ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సౌభాగ్యనగర్ కాలనీ అధ్యక్షుడు నందకిషోర్, కాలనీల ప్రతినిధులు జక్కిడి సంజీవ రెడ్డి, సరస్వతి, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పసుమాముల ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. త్వరలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు ప్యాడ్‌లు, పెన్నులు, రబ్బర్లు తదితర వాటిని అందించినట్లు ఫౌండర్ ఎన్. మల్కన్న తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అమీర్, విద్యాధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని బ్లాక్‌మెయిలింగ్ చేస్తున్న యువకుడి అరెస్ట్

సైదాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఓ ఇంటర్ విద్యార్థినిని బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న ఓ యువకుడిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సైదాబాద్‌కు చెందిన ఓ ఇంటర్ విద్యార్థినికి బోయిన్‌పల్లిలోని ఓ పెండ్లి వేడుకలలో దూరపు బంధువైన ఓ యువకుడు సుమైర్ పరిచయం ఏర్పరుచుకున్నాడు. ఆమెతో ఫొటోలు, వీడియోలు తీసుకుని లైంగికంగా వేధిస్తూ, డబ్బులు, బంగారం డిమాండ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం విద్యార్థిని ఇంటి వద్దకు వచ్చాడు. అతడిని గమనించిన బాధితురాలు కుటుంబసభ్యులకు తెలియజేసింది. తండ్రి ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని యువకుడిని అరెస్ట్ చేశారు.

ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షలు

మన్సూరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాగోల్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన పరుశురాంతో పాటు, ఎస్ఐ మధును బీఆర్ఎస్ నాగోల్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, నాయకుడు అనంతుల రాజిరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలి

● ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి


నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన తీగల కృష్ణారెడ్డి, అనితారెడ్డి, బాలకిషన్

ఎల్‌బీనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కంకణబద్ధులై కృషి చేయాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్న విషయం నాయకులు, కార్యకర్తలు మరవొద్దన్నారు. మహేశ్వరం నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి కోసం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కలసికట్టుగా పనిచేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, మహేందర్, బేర బాలకిషన్, ఆకుల అరవింద్‌కుమార్, కుంచె నాగేందర్‌గౌడ్, సరికొండ మల్లేష్, చప్పిడి సంతోష్‌రెడ్డి, సదానందం గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తును కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

వనస్థలిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేతలు తప్పవని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావని అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్ పార్కు వెనుకాల 20ఫీట్ల రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తును టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం తమ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావని మాట్లాడుతూ కాలనీలో నిర్మాణాలు చేపడుతున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకుని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలా కాకుండా తమ ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మాణాలు చేపడితే సహించేది లేదని ఆ నిర్మాణాలను తప్పనిసరిగా కూల్చివేస్తామని ఆమె హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్‌బీడీసీఎఫ్‌ఓడబ్ల్యూఏ కార్యవర్గం ఎన్నిక

మన్సూరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ పరిధి బండ్లగూడలోని సహభావన డైమండ్ క్లాసిక్ ఫ్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్‌బీడీసీఎఫ్‌ఓడబ్ల్యూఏ) నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైనట్లు ప్రతినిధులు తెలిపారు. పోటాపోటీగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వట్నాల విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కొలను గణేష్, ప్రధాన కార్యదర్శిగా భూంపల్లి ప్రవీణ్‌రెడ్డి, కోశాధికారిగా కె.వి.ఎల్.ఎన్.మూర్తి, కార్యదర్శిగా వలిశెట్టి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా వేముల శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ కోశాధికారిగా వెల్లంపల్లి వేణుకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మన్నెం అవినాష్ ఎన్నికైనట్లు ప్రతినిధులు తెలిపారు. కె.ఎల్.శ్రీనివాస్‌రావు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు.

హయత్‌నగర్‌లో 8నుంచి బ్యాడ్మింటన్ టోర్నమెంట్

హయత్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి రోజున హయత్‌నగర్ పాత రోడ్డులోని ఎస్‌వీఎస్ ఇండోర్ స్టేడియంలో గజ్జి యాదయ్య, రాజమ్మ మెమోరియల్ స్మారక బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు గజ్జి నర్సింహయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న సాయంత్రం ప్రారంభమై 9న సాయంత్రం ముగిస్తాయని, రూ. 800 ఎంట్రీ ఫీజు చెల్లించి టీం పేరును 7వ తేది 5.00 గంటల్లోగా నమోదు చేయించుకోవాలని కోరారు. విజేత టీంలకు రూ. లక్ష ప్రైజ్ మనీ, షీల్డు ఉంటుందన్నారు. బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనదలిచిన వారు ఇతర వివరాల కోసం కె. రాజారావు - 9704541579, జీఎన్ యాదవ్- 9849956055, ఫోన్ నంబర్‌లలో సంప్రదించాలని కోరారు. ఎంట్రీ ఫీజు ఫోన్ పే నంబర్ కౌశిక్- 9959647689 జమ చేయాలన్నారు.

ఉరేసుకుని బైక్ మెకానిక్ ఆత్మహత్య



అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని బైక్ మెకానిక్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. స్టేషన్ పరిధిలోని బీసీ కాలనీకి చెందిన ఎస్‌కే జిలానీ చిన్న కుమారుడు ఎస్‌కే ముక్రం(25) బైక్ మెకానిక్. ఆదివారం రాత్రి 2గంటల సమయంలో నిద్రపోకుండా ఇంట్లో అటు ఇటు తిరుగుతున్నాడు. అది గమనించిన తండ్రి ముక్రంను పడుకోమని చెప్పాడు. వెంటనే తన బెడ్‌రూంలోకి వెళ్లి పడుకున్నాడు. ఉదయం 5గంటలకు నిద్రలేచిన జిలానీ కుమారుడి గదిలోకి వెళ్లి చూడగా ప్లాస్టిక్ తాడుతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ముక్రం ఒక అమ్మాయిని ప్రేమించాడని ఆమెకు మరొకరితో పెళ్లి జరిగిందని, అనంతరం ఆమె విడాకులు తీసుకుని ముక్రంతో ఫోన్‌లో మాట్లాడేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మృతుడి తండ్రి పేర్కొన్నాడు. అయితే కొద్ది రోజులుగా ఆమె ముక్రంతో మాట్లాడడం లేదని దాంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి పైప్‌లైన్ పనులు త్వరగా చేపట్టాలి

● జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


జలమండలి అధికారులతో పనుల పురోగతిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల మంజూరైన నూతన నీటి పైప్‌లైన్ల పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సూచించారు. నియోజకవర్గ పరిధిలోని నూతన నీటి పైప్‌లైన్ పనులు, యూజీడీ పనులపై జలమండలి అధికారులతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దాదాపు 80కిలోమీటర్ల మేర మంచినీటి పైప్‌లైన్ పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. దానికి తోడుగా మరో 18 కిలోమీటర్ల మేర నూతన మంచినీటి పైప్‌లైన్ పనులకు జలమండలి ఎండీని కోరగా నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఆ పనులను త్వరగా ప్రారంభించడానికి సన్నాహాలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు రాజ్‌గోపాల్, రాజు, వాహిణి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా ఈటలను ప్రకటించడం అభినందనీయం : కార్పొరేటర్


ఈటలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, తదితరులు

వనస్థలిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ను అధిష్ఠానం ప్రకటించడం అభినందనీయమని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఈ మేరకు కార్పొరేటర్ డివిజన్ పార్టీ శ్రేణులతో ఈటెల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొంతం నవకిషోర్‌రెడ్డి, నాయకులు సంతోష్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, రఘురామ్ నేత, శరత్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణతో సమస్యలు తలెత్తకుండా చూడాలి: కార్పొరేటర్


మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సీవరేజ్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అధికారులకు సూచించారు. జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా మన్సూరాబాద్ డివిజన్ గణేష్‌నగర్ వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పాడైన నేపథ్యంలో కాలనీవాసులతో కలిసి నర్సింహారెడ్డి సోమవారం పరిశీలించారు. మ్యాన్‌హోళ్లు మూసివేయడంతో మురుగు పొంగిపొర్లుతుందన్నారు. జలమండలి అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో పని చేసి సమస్య పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సతీష్, సుధాకర్, శ్రీను, రఘుపతిరావు, మురళీధర్ పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

● కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి


కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న లట్టుపల్లి రమేష్‌రెడ్డి తదితరులు

చంపాపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని ఆయా కాలనీలు, బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే తన ప్రథమ కర్తవ్యం అని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని దుర్గాభవానీనగర్‌కాలనీ అధ్యక్షుడు లట్టుపల్లి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు సోమవారం కార్పొరేటర్‌ను ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దుర్గాభవానీనగర్‌కాలనీలో కమ్యూనిటీహాల్, పార్కు అభివృద్ధి, సీసీ రహదారుల నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు నాగేశ్వర్‌రావు, ఓంరెడ్డి, రాజేందర్‌గౌడ్, విఠలేష్, శ్రీనివాస్‌రెడ్డి, యాదిరెడ్డి, రత్నమాచారి పాల్గొన్నారు.

భాగ్యనగర్‌కాలనీఫేజ్-1 సమస్యల పరిష్కారానికి కృషి

● కార్పొరేటర్ సుజాతానాయక్


కార్పొరేటర్ సుజాతానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న భాగ్యనగర్‌కాలనీ ఫేజ్-1 ప్రతినిధులు

చంపాపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని భాగ్యనగర్‌కాలనీ ఫేజ్-1లో కార్పొరేటర్ సుజాతానాయక్ సోమవారం పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేయించి కాలనీలో సీసీ రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జంగారెడ్డి, నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు రాజు, మహేష్, గోపాల్‌రావు, రఘుపతిరెడ్డి, సృజన, నరేంద్రబాబు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

● కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి


సమావేశంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీలు, మురికివాడల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పారిశుధ్య విభాగం సిబ్బందికి సూచించారు. సోమవారం ఆమె మలక్‌పేట సర్కిల్-6 శానిటేషన్ జవాన్ రమేష్, రాంకీ సర్కిల్-6 ఇన్‌చార్జి దినేష్, ఎస్ఎఫ్ఏలు శ్రీనివాస్, ముజీబ్, సుభాష్, శ్రీను, నర్సింగ్, శ్రీనునాయక్, గణేశ్‌తో పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

నేడు సైదాబాద్‌లో బీజేపీ నిరసన దీక్ష

సైదాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం మీదుగా నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.